



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

బుధవారం 4 జూన్ 2025 - పేజీలు 8












అక్షర జ్ఞానం లేని జీవితం అంధకారంతో సమానం.. అలాంటి అక్షర జ్ఞానాన్ని అందిస్తున్న పాఠశాలలకు తన వంతు చేయూతనిస్తూ ముందుకు సాగుతోంది ఓ మహిళ. పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తన వంతు చేయూతనిస్తూ వారి ఉన్నతికి బాటలు వేస్తోంది. ఆమె చేసే సేవా తత్పరతకు పాఠశాల ఉపాధ్యాయులు ఎనలేని సహకారం అందిస్తున్నారు. పాఠశాల ఉన్నతికి అందరూ సమైక్యంగా ఐక్యమత్యంతో చేయి చేయి కలిపి ముందుకు సాగుతున్నారు. దీంతో పాఠశాల అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. చక్కటి విద్యతో పరిడవిల్లుతోంది. ఇలాంటి పాఠశాలలు జిల్లాలోని మిగతా పాఠశాలకు ఆదర్శంగా ఉండాలి. విద్య, ఆరోగ్యం, పర్యావరణ, సేవల్లో ఆశాజ్యోతిని వెలిగిస్తున్న ప్రేరణ శిక్షణ సేవా సమితి లాంటి సామాజిక సేవా సంస్థలు ఊరికి ఒకటి ఆవిర్భవిస్తే అన్ని గ్రామాల్లో పాఠశాలలు అభివృద్ధి పథంలో పయనిస్తాయనటంలో ఎలాంటి సందేహం లేదు. ప్రేరణ శిక్షణ సేవా సమితి లాంటి ఒక సామాజిక సేవా సంస్థను నెలకొల్పాలన్న ఆలోచన నాగార్జున అనే ఒక మహిళ మనసులో కలగటం ఎంతో గర్వించదగ్గ పరిణామం.. ఆ మహిళ మదిలో మెదిలిన ఆలోచనతో చేబ్రోలు మండలం వేజెండ్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల అన్ని రంగాల్లో, అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక
సూర్య బ్యూరో


## సామాజిక సేవల్లో మేటి...

# విద్యా సేవల్లో ఆశాజ్యోతి..

గుంటూరులో విద్య, ఆరోగ్యం, పర్యావరణ సేవలతో ప్రజల్లో ఆశాజ్యోతి వెలిగిస్తూ "ప్రేరణ శిక్షణ సేవా సమితి ముందుకు సాగుతోంది. జిల్లాలోనే సామాజిక సేవా రంగంలో అమూల్యమైన మార్పును తీసుకొస్తున్న సంస్థగా ప్రేరణ శిక్షణ సేవా సమితి గుర్తింపు పొందింది.. ఈ సంస్థ ను నోటి నాగార్జున అనే మహిళ ఒక మంచి సంకల్పంతో డిసెంబర్ 2017 న ఈ సంస్థను స్థాపించింది. ఎలాంటి లాభా పేక్ష లేకుండా స్వచ్ఛంద సంస్థగా దీనిని ప్రారంభించారు. స్థాపించబడినప్పటి నుంచి, నిస్వార్ధంగా విద్య,ఆరోగ్యం, పర్యావరణ, మానవతా సేవల్లో తనదైన ముద్ర వేస్తోంది. సమాజానికి అవసరమైన చక్కటి మానవతా విలువలను బోధిస్తూ ముందుకు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పేద , మధ్య తరగతి జీవన ప్రమాణాలను కూడా మెరుగుపరిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఇందుకుగాను ఒక నిర్దిష్టలక్ష్యంతో ఈ సంస్థ

మిగతా 5వ పేజీలో

- సేవా తత్పరతకు చేయూతనిస్తున్న ఉపాధ్యాయులు
- సమాజంలో ప్రేరణ తెస్తున్న ప్రేరణ శిక్షణ సేవా సమితి
- నాటి నాగార్జున నేడు రగిల్చిన చైతన్యం
- వేజెండ్ల పాఠశాలలో విరబూస్తున్న విద్యా కుసుమాలు
- ఊరికో సంస్థ ఉంటే ఎంత ఉపకారమో







## శిథిలావస్థలో ఉన్న వంతెనను పరిశీలించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



**పెదకాకాని, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన కాకాని నుంచి గొల్లమూడి వెళ్ళు రోడ్డులో గల గుంటూరు ఛానల్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరిందని దానిని వెంటనే పునరుద్ధరించాలని గత నెల 26వ,తేదీన గుంటూరు కలెక్టరేట్లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కె.వసంతరావు అందజేసిన అర్జీకి స్పందించిన అధికారులు మంగళవారం వచ్చి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అవినాష్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ ను త్వరలోనే ఆధునికరించడం జరుగుతున్నదని ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉన్నదని, ప్రస్తుతం వారం పది రోజుల్లో గుంటూరు ఛానల్ కాలువ కట్ట పొడవున ఎక్కడైతే కట్టలు తెగినివో ఆయా ప్రాంతంలో మరమ్మత్తులు ప్రారంభిస్తామని తెలియజేశారు.

## అన్నదాత సుఖీభవ పథకం క్రింద రైతులను ఆదుకోండి



**తెనాలి, మేజర్ న్యూస్ :** కౌలు రైతులు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం క్రింద రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ మంగళవారం తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాల కృష్ణకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కౌలు రైతులకు చేసిన అన్యాయాన్ని సరిచేసి కౌలు రైతులందరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానం ఈ సంవత్సరం కూడా అమలు జరిగేటట్లు లేదని ఆయన పేర్కొన్నారు. నూటికి 70, 80% గా ఉన్న కౌలు రైతులు సిసిఆర్సి కార్డులు అందక రుణాలు ప్రభుత్వస్థాయము దక్కక నష్టపోతున్నారని ఆయన ఆవేదన చెందారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ గత సంవత్సరం తెనాలి మండలంలో ఇచ్చిన కౌలు కార్డులు కంటే రెట్టింపు కార్డులు ఇచ్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ జొన్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేకపోవడం తో దళారీలు తక్కువ రేటుకి కొనుగోలు చేసి రైతుల్ని దోచుకుంటున్నారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొనుగోలు కేంద్రాలు తెరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు నాగరాజు కౌలు రైతుల నాయకులు వేజెండ్ల తబిత, తెనాలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఘనంగా మనోజ్ పుట్టినరోజు వేడుకలు



**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకాకానిలో మనోజ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గాజు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరాచకవాదులకు జగన్ మద్దతు శోచనీయం



**తెనాలి, మేజర్ న్యూస్ :** అరాచకాలకు పాల్పడుతున్న గంజాయి ముఠాను ప్రోత్సహించడం ద్వారా జగన్ తన నిజ స్వరూపాన్ని చూయించాడని ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు సౌపాటి కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ దిగజారి రౌడీ షీటర్లను పరామర్శించడానికి తెనాలి రావడం సిగ్గు చేటని విమర్శించారు. సీఎం చంద్రబాబు పై 24 కేసులు ఉన్నాయి ఆయన్ని కూడా అలానే చేస్తారా అంటూ జగన్ వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. జగన్ పైనా 33 కేసులున్నాయి మరి జగన్ను ఏమి చేయాలని ప్రశ్నించారు. రాష్ట్ర ఐటీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి గంజాయికి బానిసలై ప్రజలు,పోలీసులపై దాడులు చేసే వారిని వెనకేసుకుని రావడం నీచమని పైగా దానికి కులాన్ని ఆపాదించడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. జగన్ చేసిన పనికి వైసీపీ నేతలే రానున్న రోజుల్లో ఆ పార్టీలో ఉండడం కష్టమని జోస్యం చెప్పారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గిరి గణేష్ మాట్లాడుతూ జగన్ బాధితులకు కాక బాధించే వారికి మద్దతు తెలపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయం అర్థమయ్యే ప్రజలు 11 సీట్లకు సరిపెట్టారని ఇక అవి కూడా రావని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షులు అత్తోట శరత్, మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు కోపల్లె శ్రీను, ఫణిదపు దుర్గ, డేవిడ్, రవీంద్ర, కొమ్మూరి వెంకటేశ్వర్లు, గోపి, రాజేంద్రప్రసాద్, కిరణ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలు, ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాల తనిఖీలు : ఏడిఏ శ్రీధర్ రెడ్డి



**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇంచార్జీ ) యస్ శ్రీధర్ రెడ్డి మంగళవారం సత్తెనపల్లి పట్టణంలోని పలు విత్తన దుకాణాలు, ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాల ను తనిఖీ చేశారు. ఈ ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణం లోని విత్తన దుకాణదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా విత్తన ధరల పట్టిక, రోజువారి విత్తన నిల్వలు వివరాలను ప్రతి ఒక్క డీలర్ షాపు నందు ప్రదర్శించాలని సూచించారు. అదే విధంగా రైతులకు కావలసిన విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించకుండా అధిక ధరలకు అమ్మకూడదని, విత్తన డీలర్లు, రైతులకు తప్పకుండా విత్తన అమ్మకాలు బిల్లులు ఇవ్వాలని, ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ నుండే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన డీలర్లు అధీకృత కంపెనీ నుండే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్లు, రైతులకు అధిక ధరలకు విత్తనాలు అమ్మినా అనుమతులు లేని విత్తనాలు విక్రయాలు జరిపిన శాఖాపరమైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సత్తెనపల్లి పట్టణం లోని ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాలు తనిఖీ చేసి షాపు లేదా డీలర్ పేరు మీద బిల్లు లేకుండా ఎటువంటి విత్తనాలు నిల్వలు వచ్చినా వ్యవసాయ అధికారి వారి కార్యాలయం నకు తెలియజేయాలని ఆయన సూచించారు.

# ఏపీజిఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి



**తెనాలి, (కొల్లిపర) మేజర్ న్యూస్ :** జూన్ 5వ తేదీన విజయవాడలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ బందర్ రోడ్డు జరుగనున్న రాష్ట్రకౌన్సిల్ సమావేశమునకు ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరుకావాలని దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందెబాలచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్ కోరారు. మంగళవారం కొల్లిపర తహసి ల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ, రిజిస్ట్రేషన్ సిబ్బందిని కలసి సమావే శానికి ఆహ్వానించారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకు వివరిస్తామని, ఉద్యోగుల పక్షపాతిగా మన ముఖ్యమంత్రి మంచి పిఆర్‌సి ఇస్తారనేఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపు శ్రీలక్ష్మీ కుమారి, కార్యవర్ గసభ్యులు కొల్లిపర మండల సబ్ రిజిస్ట్రార్ ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎం.శ్రీలక్ష్మీకుమారి, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కవల పిల్లలకు సీఎంఆర్ఎఫ్ సాయం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందుకున్న కవల చిన్నారుల చిరునవ్వులే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని సుద్దపల్లి డొంక ఆల్లీనగర్ కు చెందిన పఠాన్ సలీం, కరిష్మా దంపతులకు కవలలు జన్మించారు. వీరు ఏడో నెలలోనే జన్మించడంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. దీంతో సలీం కుటుంబానిఖ రూ.7 లక్షల వరకు ఖర్చు అయింది. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే నసీర్ ను సంప్రదించారు. ఎమ్మెల్యే నసీర్ వెంటనే స్పందించి వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దరఖాస్తు చేయించారు. ఆ నిధులు వచ్చే వరకు తమ కార్యాలయం ద్వారా పర్యవేక్షించారు. దీంతో వారికి రూ.2.57 లక్షలు సీమ్ రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సలీం ఇంటి వద్దకు ఎమ్మెల్యే నసీర్ స్వయంగా వెల్లి సీమ్ రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2 కోట్లకుపైగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే ఏ ఒక్కరూ ఆర్థిక సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ద్వారా ఆదుకుంటున్నారని అన్నారు. కరిష్మా, సలీం దంపతులు మాట్లాడుతూ తమ బిడ్డల చిరునవ్వులకు సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కారణమని, వారికి రుణపడి ఉంటామని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బీ బసవ శంకర్రావు కుటుంబానికి రూ.31, టీ సోమ సుందర రావు కుటుంబానికి రూ.26 వేలు చొప్పున ఎమ్మెల్యే నసీర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ ఎల్లావుల అశోక్, మీరావాలి, రియాజ్, జమీర్, కందుకూరి వెంకట్, ప్రభాకర్, ఫరూక్, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దండి



**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మచిలీపట్నం, రామయపట్నం, మూలపేట పోర్టుల మొదటి దశ పనులు, అలాగే కాకినాడ గేట్ వే పోర్టు పనులు వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని... మరోవైపు జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు మన రాష్ట్ర సంపదని... వాటి నిర్మాణం త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పోర్టుల ఆపరేషన్-మెయింటనెన్స్‌పైనా అధికారులతో చర్చించారు. మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా...ఆ ప్రాంతానికి మరింత ఆదాయం సమకూర్చేలా ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**గిరిజన ప్రాంతాల్లో హెలీ పోర్టులు :**

రాష్ట్రంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన కుప్పం,

- **వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయండి**
- **తొలిదశలో కుప్పం, దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం ఎయిర్ పోర్టుల నిర్మాణం**
- **పీపీపీ విధానంలో రద్దీకి అనుగుణంగా రాష్ట్ర రహదారుల విస్తరణ**
- **జాతీయ రహదారులతో అన్ని రాష్ట్ర రహదారులు అనుసంధానం**
- **త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు**
- **పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం(పలాస) ఎయిర్ పోర్టుల నిర్మాణం ముందుగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు మొత్తం కలిపి 20కి తగ్గకుండా, అలాగే 14 ఎయిర్ పోర్టులు ఉండేలా చూడాలని చెప్పారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రాష్ట్ర రహదారుల విస్తరణ చేపట్టాలని, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి సూచించారు. పీపీపీ విధానంలో వీటిని అభివృద్ధి చేయాలన్నారు. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధే లక్ష్యంగా త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చెందేలా హెలీ పోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

**శరవేగంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం**

మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తి కాగా వచ్చే ఏడాది నవంబర్ నాటికి మొత్తం పనులు పూర్తికానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. రామయపట్నం పోర్టు మొదటి దశ పనులు 63.89 శాతం, మూలపేట పోర్టు మొదటి దశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్ వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మొదటి దశ నిర్మాణం పనులు 97.72 శాతం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 81.17 శాతం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం పూర్తయ్యాయని అధికారులు సీఎంకు తెలియజేశారు.

# ఖరీఫ్ కోసం విత్తనాలు సన్నద్ధం

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఖరీఫ్ 2025 సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన విత్తనాల సరఫరా , నాణ్యత నియంత్రణ కోసం సమగ్ర చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రధాన పంటలైన ప్రత్తి, మిరప, వరి సాగు కోసం అంచనా వేసిన విస్తీర్ణం ఆధారంగా విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ రైతులకు నాణ్యమైన సేవలను అందించేందుకు శాఖ కట్టుబడి ఉంది.పంటల విస్తీర్ణం మరియు విత్తన అవసరాలు, వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం, జిల్లాలో ప్రత్తి సాధారణ విస్తీర్ణం 91,566 హెక్టార్లు కాగా, ఈ సీజన్‌లో 1,12,545 హెక్టార్లలో సాగు జరుగనుంది. దీనికి 7,03,408 ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయి. అదేవిధంగా, మిరప పంట సాధారణ విస్తీర్ణం 55,786 హెక్టార్లు కాగా, 61,112 హెక్టార్లలో సాగు కోసం 15,27,803 ప్యాకెట్లు, వరి పంట సాధారణ విస్తీర్ణం 38,599 హెక్టార్లు కాగా, 53,650 హెక్టార్ల సాగుకు 25,250 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అంచనా వేశారు. ఈ అవసరాలను తీర్చేందుకు అన్ని కంపెనీ రకాల విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎ.పి.సీడ్స్, గుంటూరు ఆధ్వర్యంలో జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను 50% రాయితీపై సరఫరా చేస్తున్నారు.

**కఠిన నిఘా వ్యవస్థ**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ, మండల, సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ట్రాన్స్‌పోర్ట్ ఏజన్సీలు, జిన్నింగ్ మిల్లులు, విత్తన యూనిట్లు, డీలరు దుకాణాలలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జూన్ 3, 2025న నరసరావుపేటలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి వివిధ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను తనిఖీ చేసి, విత్తన సరఫరా వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించారు.

**రైతులకు సూచనలు**

రైతులు కేవలం అధికృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు బిల్లును భద్రపరచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ సూచిస్తోంది. లూజ్ విత్తనాలు అమ్ముతున్న ఎవరైనా గుర్తిస్తే, సంబంధిత వ్యవసాయ అధికారి లేదా సహాయ వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయాలని కోరింది. అధిక ధరలకు విత్తనాలు అమ్మిన డీలర్లపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని శాఖ హెచ్చరించింది.

**కాల్ సెంటర్ల ఏర్పాటు**

రైతుల సౌకర్యార్థం జిల్లాలోని ఆరు సబ్ డివిజన్లలో కాల్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల కోసం కింది నంబర్లకు సంప్రదించవచ్చు:మాచర్ల: 8331056953 పిడుగురాళ్ళ: 8331056947 నరసరావుపేట: 8331056941 వినుకొండ: 8331056959 సత్తెనపల్లి: 8331056930 క్రోసూరు: 8331056936 జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కూడా కాల్ సెంటర్ ఏర్పాటు చేయబడింది. ఫిర్యాదుల కోసం 8331056905 నంబర్‌కు సంప్రదించాలని ఐ. మురళి తెలియజేశారు. పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ ఖరీఫ్ 2025 సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల సరఫరా, నాణ్యత నియంత్రణ, మరియు పారదర్శక వ్యవస్థను నిర్ధారించేందుకు అన్ని చర్యలు చేపడుతోంది. రైతులు ఈ సౌకర్యాలను సద్విని యోగం చేసుకొని, ఏవైనా సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని శాఖ కోరుతోంది

## ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలో విద్యుత్ వినియోగదారులకు లోవోల్టేజ్ సమస్య తీర్చటంలో భాగంగా స్థానిక ఏనుగుల బజార్లో మరియు బాపనయ్య నగర్ లో ఏర్పాటు చేసినటువంటి నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను నరసరావుపేట శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్ ప్రారంభించారు ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించే కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రోత్సాహంతో ఈ యొక్క నియోజకవర్గంలో నూతన ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసుకోవడం జరిగిందని వాటిలో భాగంగా ఈ రోజున ఏనుగుల బజార్ మరియు బాపనయ్య నగర్ లో ట్రాన్స్ఫార్మర్లు ప్రారంభించడం జరిగిందన్నారుఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ రాంబట్లు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుండి వినియోగదారులు ఈ ప్రాంతంలో సమస్య ఉందని పేర్కొన్న తరుణంలో స్థానిక శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల దినోత్సవం లో వచ్చిన అర్జీల ఆధారంగా ఈ యొక్క విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు ఒక్కొక్కటి సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో మంజూరు చేసుకుని ప్రారంభించడం జరిగింది అదేవిధంగా నియోజకవర్గంలో విద్యుత్ శాఖ సంబంధించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాబోయే రోజుల్లో నిరంతర విద్యుత్ కొరకు అన్నిప్రాణాళికలు తయారు చేస్తున్నామని ముఖ్యంగా ప్రధానమంత్రి సూర్య యోజన కింద రాయితీతో కూడిన సోలార్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో నరసరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ అసిస్టెంట్ ఇంజనీర్లు రఫీ, సురేంద్రబాబు విద్యుత్ శాఖ సిబ్బంది ఆర్ బంగారయ్య లైన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు ఈ రెండు ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యుత్ వాడకందారులు తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు చేసిన వన్ టౌన్ సిఐ విజయ్ చరణ్



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** సామాజిక భద్రతనుమెరుగుపరిచేందుకు మరియు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు నరసరావుపేట 1టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ రోడ్ పరిసరాలలో మరియు వాహన తనిఖీలను బలోపేతంచేయడమైనది.ఈ చర్యల ప్రధాన లక్ష్యాలు:చట్టవిరుద్ధ చర్యలు, అనుచిత కార్యకలాపాలను నిరోధించటంట్రాఫిక్ నియమాలను సమర్థవంతంగా అమలు చేయటంప్రజలకు భద్రతా భావన కలిగించటంవాహనాల యొక్క సరైన పత్రాలు, హెల్మెట్లు, నంబరు ప్లేట్లు, మద్యం సేవించి వాహనం నడుపుతున్నదేనా వంటి అంశాలపై తనిఖీలు చేయటం దీనిలో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు బృందాలు నియమించబడి నిరంతరంగా పర్యవేక్షణ జరుపుతున్నాయి. తనిఖీల సమయంలో ప్రజలు సహకరించాలని మనవి. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహన సంబంధిత పత్రాలు వెంట తీసుకెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతున్నాం.ఈ తరహా కనిపించే పోలీసింగ్ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే అవకాశం కలిగి ఉండటంతో పాటు నేరాల నివారణకు దోహదపడతాయి.భద్రమైన సమాజ నిర్మాణంలో మా పోలీస్ విభాగానికి సహకరిస్తున్న నరసరావుపేట ప్రజలకు మనఃపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

## ముగిసిన శిక్షణ కార్యక్రమాలు




**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని శ్రీ సద్గురు శుభ వేదికలో ఏప్రిల్ 25 నుంచి 40 రోజులు పాటు విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు నేటితో ముగిశాయి. శ్రీశ్రీ శ్రీ విమలానంద స్వామి సంయుక్త ఆధ్వర్యంలో 45 రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా, యోగ తదితర కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. 75 మంది విద్యార్థులు హాజరై శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా. దుగ్గిరాల పి ఎస్ సి వైద్యాధికారి ఎండి అబ్దుల్ రెహమాన్ హాజరుకాగా మహిళా నాయకురాలు జంపాల కుసుమ కుమారి , గణేష్ అతిథులను శాలువాలతో సన్మానించారు .అనంతరం చిన్నారులకు అన్న ప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జంపాల కుసుమకుమారి ,ఎర్ర మాసు. మృత్యుంజయ రావు. పసుపులేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలలో మాట్రిక్స్ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** మాట్రిక్స్ విద్యా సంస్థల విద్యార్థులు సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని మాట్రిక్స్ విద్యాసంస్థల డైరెక్టర్ లు రామిరెడ్డి, ఏడుకొండలు తెలిపారు. మ్యాట్రెస్ విద్యాసంస్థల్లో జరిగిన ఆయా ర్యాంకర్ల అభినందన సభలో డైరెక్టర్ లు మాట్లాడారు. బి శివతేజ 1179 వ ర్యాంకు, కె పరిమళ సౌమ్య 2682 (%జూ%) వ ర్యాంకు, .కె చరణ్ తేజ 3041, హర్ష నారాయణ 5051 వ ర్యాంకు, సిహెచ్. హాసిని 5060, ఎం.చెల్సియా 5376 వ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ర్యాంకర్ల కు పుష్పగుచ్ఛాలని అందించి డైరెక్టర్లు రామిరెడ్డి ఏడుకొండలు తదితరులు అభినందించారు. అభినందన సభలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కాపు యువజన కన్వీనర్ గా మనోజ్ కుమార్



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని గ్రామానికి మనోజ్ కుమార్ జిల్లా కాపు యువజన కన్వీనర్ గా ఏపీ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా మంగళ వారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ కాపు వర్గానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా కాపు యువజన కన్వీనర్ గా ఎన్నుకోవడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# చెరువును తలపిస్తున్న ఆట స్థలం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు క్రీడాకారులు

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** పట్టణంలోని సర్వే హై స్కూల్ ఆటస్థలం వాన నీటితో సగం నిండిపోయింది. చూడటానికి చిన్న సైజు కొలనులా మారింది. పక్కనే చెత్త వేసే ప్రదేశం ఉండటంతో, దానిలో చెత్త కూడా తడిసి దుర్వాసన కొడుతూ క్రీడాకారులు ఆడుకోటానికి సైతం ఇబ్బందిగా ఉంది. అంతేకాకుండా గ్రౌండ్ ఆనుకొని ఉన్న ఇల్లు చుట్టుపక్కల ఉన్న గృహస్తులు మురుగునీటి దుర్వాసనతో, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానలు ఇటువంటి పరిస్థితుల్లో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. వచ్చేవారం స్కూల్ తెరిచే అవకాశం ఉండటంతో ఆటలాడుకునే పిల్లలకు సైతం ఇబ్బందికరంగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మునిసిపల్ అధికారులు స్పందించి వాన నీటిని ఆట స్థలంలో నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు స్థానికులు.

# నేడు విద్యుత్తుకు అంతరాయం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** విద్యుత్తు లైన్స్ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా అంతరాయం కలుగునని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీహెచ్ ఖాన్ తెలియజేసినట్లు పెదకాకాని ఏఈ బ్రహ్మయ్య మంగళవారం తెలిపారు. బుధవారం ఉ. గం. 8 నుండి మధ్యాహ్నం గం.2 వరకు అంతరాయం కలుగు ఏరియాలు పెదకాకాని సుందరయ్య కాలనీ, బాజీ బాబా దర్గా ఏరియా, గౌడ్ పాలెం, సదాశివయ్య కాలనీ, వెనిగండ్ల రోడ్డు, తోట బైబిల్ మిషన్ ఏరియా, జ్యోతి నగర్, అంబేద్కర్ నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు ఏరియా, పొట్టి శ్రీరాములు వారి వీధి వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగునని, వినియోగదారులందరూ గమనించి సహకరించగలరని తెలిపారు.

# 70% హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే : కన్నా

- వెన్నుపోటు.. గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డి దే..
- కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా..



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఐదేళ్లల్లో 85శాతం హామీలకు ఎగనామంపెట్టిన ఘనత జగన్ సర్కార్ దేనన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బెరైటీస్ మైన్లో జగన్ తాత రాజారెడ్డి కి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్ ని హత్య చేసి ఆ మైన్ ను రాజారెడ్డి కబ్జా చేశాడు.. బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బెరైటీస్ గని యాజమాని అయ్యారన్నారు. కాంగ్రెస్ ని అడ్డంపెట్టుకొని రూ. లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించాడు....శివకుమార్ స్థాపించిన వైకాపా పార్టీని కబ్జా చేసి శివకుమార్ కు వెన్నుపోటు పొడిచాడు...ఎత్తుకొని పెంచిన బాబాయ్ ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచాడు...ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడు...ఐదేళ్ల పాలనలో 85 శాతం హామీలు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు...మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచాడు... మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్ను పోటు పొడిచాడు...అన్నక్యాంటీన్లు రద్దు చేసి పేదలను, కార్మికులను వెన్నుపోటు పొడిచాడు... బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచాడని కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు....**

మొదటి నెలలోనే రూ. 4వేలు పింఛన్ పెంచి అమలు చేశాం... నెలకు రూ.2720 కోట్లు.. ఏడాదిలో రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి.. మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నాం.. దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం.. ఇప్పటికి కోటి సిలిండర్లు ఇచ్చాం.. ఈ పథకం కోసం ఏడాదికి రూ.2684 కోట్లు ఖర్చు చేస్తున్నాం.. అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టాం.. ఇప్పటికి రూ.1200 కోట్లు ఖర్చు చేసి, 20 వేల కి.మీ రోడ్లు బాగుచేశాం.. మళ్లీ వర్షాలు వచ్చాయి.. దెబ్బతిన్న రోడ్లను బాగుచేస్తాం.. ఇది నిరంతరం ప్రక్రియ.. గత ప్రభుత్వం లా వదిలెయ్యం..మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం.. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు ఇప్పటికే అందజేశాం..203 అన్న క్యాంటీన్లు తెరిచాం..21 దేవాలయాల్లో నిత్య అన్నదానం ప్రారంభిస్తున్నాం.. చెత్త పన్ను రద్దు చేశాం.. గత ప్రభుత్వం పన్ను వేసింది కానీ..83 లక్షల టన్నుల చెత్త తీయలేదు..ధాన్యం రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1674 కోట్లు విడుదల చేశాం.. కూటమి ప్రభుత్వంలో రూ.990 కోట్లు పంచాయతీలకు కేటాయింపు..రూ.4500 కోట్లతో గ్రామాల్లో 30 వేల పనులకు శ్రీకారం చుట్టాం..94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలు పునరుద్ధరించాం..2025-26 బడ్జెట్ లో బీసీల కోసం రూ.47,456 కోట్లు కేటాయించాం..నాయి బ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచాం.. చేనేతలకు జీఎస్టీ ఎత్తివేశాం.. పవర్ లూమ్స్ 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్ 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయించాం.. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.. సోలార్ విద్యుత్ పథకంలో బీసీలకు 3 కిలో వాట్లకు గాను మొత్తం రూ.98 వేలు సబ్సిడీ అందిస్తున్నాం..అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదు.. సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు.. అసలైన వెన్నుపోటు దారుడు జగన్ రెడ్డి.. వెన్ను పోటు అంటూ ధర్నాలు చేయడం.. దొంగే, దొంగ అన్నట్లుగా ఉంది..జగన్ ముఠా దుష్ప్రచారాలు తిప్పికొట్టి అభివృద్ధి- సంక్షేమాన్ని నిలబెట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.







# సామాజిక సేవల్లో మేటి..
# విద్యా సేవలో ఆశాజ్యోతి

(మొదటి పేజీ తరువాయి)

పలు సేవ కార్యక్రమాలను చేపట్టింది. ఈ ప్రయాణంలో వారికి మినీ మైండ్స్ అనే సంస్థ చక్కటి సహకారం అందిస్తోంది. ఈ సమస్త కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుంది.

**విద్యా రంగంలో ప్రేరణ:**

విద్యా అభివృద్ధి ప్రేరణ శిక్షణ సేవా సమితి అదే ప్రధాన లక్ష్యాలను రూపొందించుకుంది. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు పలు రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకు తగినట్లు వీరు ప్రేరణ కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్మెంట్ ను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా మినీ మైండ్స్ తో కలసి పాఠశాలల్లో పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు:**

ఇంగ్లీష్ స్కిల్స్ ప్రోగ్రాం ఇంగ్లీష్ స్కిల్స్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థులకి ఇంగ్లీష్ సౌండ్స్, ఇంగ్లీష్ రైటింగ్, రీడింగ్, గ్రామర్ లో శిక్షణ ఇస్తున్నారు. దీని ద్వారా పిల్లలకి ఇంగ్లీష్లో పూర్తి అవగాహన కలిగి, పట్టు సాధిస్తున్నారు. దీంతో పాటు స్పీడ్ మ్యాథ్ శిక్షణ ఇది విద్యార్థుల్లో ఉన్న గణిత భయాన్ని జయించి, వేగంగా ఖచ్చితంగా లెక్కలెయ్యడాన్ని నేర్చుకుంటున్నారు. ఇది వారిలో గణితంపై నమ్మకాన్ని పెంచుతోంది. కమ్యూనికేషన్ స్కిల్స్ వర్క్ షాపులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యాలు, బహిరంగంగా ప్రసంగించే ధైర్యం, సమాజంలో వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు సహాయపడుతోంది. ఉన్నత పాఠశాల విద్యా దశ నుంచే కంప్యూటర్ శిక్షణ ఇస్తూ సాంకేతిక రంగంపై పట్టు సాధించేలా శిక్షణ అందివ్వటం విశేషం. డిజిటల్ యుగంలో విద్యార్థులు టెక్నాలజీతో పరిచయం కావడం అత్యవసరం. కంప్యూటర్ బేసిక్స్, ఇంటర్నెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ ఈ శిక్షణ ఇస్తున్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు పూల బాటను వేస్తోంది. ఇవి కాకుండా, ప్రేరణ సంస్థ కొంతమంది విద్యార్థులకు పూర్తి విద్యా స్పాన్సర్షిప్ అందిస్తోంది – ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్లు, స్కూల్ కిట్ మొదలైన అవసరాలన్నింటినీ భరిస్తోంది. డిజిటల్ సదుపాయాలను అందిస్తూ చక్కటి సాంకేతిక విద్యపై విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఈ డిజిటల్ యుగంలో పట్టణాలలో చదివి కార్పోరేట్ విద్యకు దీటుగా గ్రామీణ విద్యార్థులకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని చూడ సంకల్పంతో పని చేస్తోంది. ఓ ప్రభుత్వ పాఠశాలకి కంప్యూటర్ సెటప్ (ప్రింటర్, వెబ్క్యామ్) అందించి, ఆన్లైన తరగతులు, పాఠశాల డాక్యుమెంటేషన్ ను సులభతరం చేసింది. మరో పాఠశాలకి స్టాండ్అలోన్ కంప్యూటర్ అందించి, విద్యార్థుల కృషికి టెక్నాలజీ ద్వారా తోడ్పాటు కల్పించింది.

యోగా లో శిక్షణ ఇస్తూ పిల్లల్లో మానసిక, శరీర దృఢత్వాన్ని, ఏకాగ్రతను పెంచుతోంది. ఈ యోగా శిక్షణ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతోంది. యోగ శిక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహించడం విశేషం. ఆరోగ్య పరిరక్షణ, మానవతా విలువలు వాటిని ఎలా పాటించాలో కూడా చిన్నారులకు విద్యార్థి దశ నుంచి అలవాటు చేసేలా శిక్షణ ఇస్తున్నారు. ప్రేరణ సంస్థ కేవలం విద్యకే పరిమితంగా కాక, సామాజిక ,సంక్షేమంలో కూడా కీలకంగా ముందడుగు వేస్తోంది.

ప్రేరణ సమస్త ఆహార వితరణ

సమస్త ఆహారం పంపిణీ చేస్తూ అన్నార్తులను ఆదుకునే తీరు ఎంతో హర్షించదగ్గ పరిణామం..

గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ సమీపంలో ఉన్న పేదలకు, రోగుల కుటుంబాలకు పౌష్టికాహార భోజనాలు అందిస్తోంది. ఆకలితో పోరాడుతున్న వారి జీవన ప్రమాణాలు పెంచుతోంది. నాణ్యమైన భోజనం అందిస్తూ గుర్తింపు పొందింది వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు ఆయుష్మన్ ఆరోగ్య మందిరం, పట్టణ ప్రాథమిక కేంద్రం,

మణిపురం గుంటూరు ప్రాంతాల్లో చలివేంద్రం ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు. దీనివల్ల రోగులు, సిబ్బంది, సందర్శకుల ఆరోగ్య పరిరక్షణకు చక్కటి బాట వేసినట్లు తెలుస్తోంది. ఇక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. జాతీయ స్థాయిలో అవసరమైన రక్తం అందుబాటులో ఉండేలా ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్ణయించుకున్నారు. దానికి తగ్గట్లు ఈ సమస్త పని చేస్తోంది. ప్రజలలో అవగాహన పెంచుతూ, సమయానుకూలంగా రక్తదానం చేపడుతోంది.

శీతాకాలంలో కంబళ్లు, బెడ్షీట్లు పంపిణీ చేసి పలువురు ప్రశంసలు అందుకుంటున్నారు. చలికాలంలో నిరాశ్రయులకు వెచ్చదనాన్ని అందిస్తూ, మానవతా దృక్పథాన్ని చాటుతోంది. పర్యావరణ పరిరక్షణ "ప్రేరణ గ్రీన్ డెవలప్మెంట్" అనే ప్రోగ్రాం ద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు కూడా ప్రేరణ సంస్థ ముందడుగు వేస్తోంది . విద్యార్థులకు పర్యావరణ పై అవగాహన కల్పించేలా సదస్సులు ఏర్పాటు చేసి వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలసి వివిధ రకాలైన పూల మొక్కలు పండ్ల మొక్కలు నాటారు.

వివిధ దేవాలయ ప్రాంగణాల్లో వేప, గానుగ, రావి, కొబ్బరి, కదంబం, జామ, నేరేడు, మామిడి ఇలా పలు రకాలైన వృక్షాలను పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు నాంది పలుకుతున్నారు. ఇప్పటివరకు ఈ సంస్థ 1000 పైగా మొక్కలను నాటి గ్రీన్ కవర్ ను పెంచి పర్యావరణ పరిరక్షణ పెంపొందించే ప్రయత్నం చేసింది. సమాజ మార్పు కోసం ప్రతిఒక్కరి భాగస్వామ్యం అవసరమని పిలుపునిస్తోంది. ప్రేరణ శిక్షణ సేవా సమితి విజయాల వెనుక వారికి తోడుగా నిలిచిన వాలంటీర్లు, దాతలు, భాగస్వాముల సహకారం ఎంతో ఉంది. వారి సేవలు, భాగస్వామ్యాన్ని వెలకట్టలేం. "విద్యతో, దయతో, సాధికారతతో అందరికీ చేరువ కావాలనుకుంటున్నాం... అదే తమ లక్ష్యం అని నిర్వాహకులు చెబుతున్నారు. మినీ మైండ్స్ లాంటి భాగస్వాములు, నిబద్ధత కలిగిన వాలంటీర్లు, స్ఫూర్తినిచ్చే దాతల సహకారంతో తాము అందరికీ వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సంస్థ వ్యవస్థాపకురాలు నాగార్జున చెప్పారు..



**విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మినీ మైండ్స్, ప్రేరణ సంస్థ**

లితం అకాడమీలో మినీ మైండ్స్ ప్రోగ్రాం యొక్క ప్రధాన లక్ష్యం విద్యను ప్రతి ఒక్క మారుమూల విద్యార్థికి అందేలా చేయడం. దానికోసం గ్రామంలో ఉన్న పిల్లలకి ఉచితంగా ఇంగ్లీష్,మాథ్స్ వివిధ కోర్సులో గత రెండు సంవత్సరాలుగా కోచింగ్ అందిస్తున్నాం. ఈ క్రమంలో మమ్మల్ని ప్రేరణ సమితి వ్యవస్థాపకురాలు నోరి నాగార్జున కలిశారు. మేము వారి సహకారంతో వేజెండ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఇంగ్లీషు స్పీడ్ మాథ్స్ ఇంగ్లీష్ గ్రామర్ వంటి వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. బయట ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎలా నేర్చుకుంటారో అదే విధంగా ఈ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులు నేర్చుకోవాలి అని అనుకొని, నాగార్జున మేము భాగస్వాములమై ఈ ప్రోగ్రాం ని చేయడం మాకు చాలా సంతోషంగా ఉందని మినీ మైండ్స్ నిర్వాహకులు రజిత శ్రీ, సాయి హిమబిందు తెలిపారు.

**ఎనలేని సహకారం అందించిన ప్రేరణ శిక్షణ సమితి, మినీ మైండ్స్ : పరాశరం శ్రీనివాసమూర్తి వెల్లడి**

ప్రేరణ శిక్షణ సమితి సమస్త తమ పాఠశాలలో పచ్చదనం కార్యక్రమం కోసం సుమారు 100 రకాల పూల మొక్కలు పంపిణీ చేశారు. ఆ మొక్కల్ని స్వయంగా పాఠశాల పిల్లలు నాటారు. పాఠశాలలో విద్యార్థుల కోసం కంప్యూటర్, ప్రింటర్ను ఏర్పాటు చేశారు. హైదరాబాదులోని మినీ మైండ్స్ వారు జనవరి 20 నుండి ప్రతిరోజు ఒక గంట పాటు ఆన్లైన్లో స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు చక్కటి శిక్షణ పొందారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి అన్ని విధాల ప్రేరణ శిక్షణ సమితి డైరెక్టర్ నోరి నాగార్జున ఎంతగానో సహకరించారని వేజెండ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరాశరం శ్రీనివాసమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా మినీ మైండ్స్ రజిత శ్రీ, సాయి బిందు, ప్రేరణ శిక్షణ సమితి డైరెక్టర్ నాగార్జునకి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రేరణ శిక్షణ సమితి, మినీ మైండ్స్ సేవలు మరువలేం ఎంఈఓ సుబ్బారావు వెల్లడి**

మండల పరిషత్ డెవలప్ మెంటు" అనే పొగ్రాం ద్వారా వేజండ్ల లోని ప్రాథమిక పాఠశాలలో "మిని మైండ్స్" వారి సహకారంతో విద్యార్థుకు ఫోనిక్స్, ఇంగ్లీషు గ్రామర్, ఇంగ్లీషు స్పీకింగ్, ఇంగ్లీష్ రైటింగ్, స్పీడ్ మేథ్స్ లలో శిక్షణ ఇవ్వటం ఎంతో గర్వించదగ్గ విషయమని చేబ్రోలు మండల ఎంఈఓ సుబ్బారావు తెలిపారు. ప్రతిరోజూ రెగ్యులర్గా ఈ ఏక్టివిటీ చేయడం వలన పిల్లలు ఇంగ్లీషు మాట్లాడడం బెరుకుతనం పోయి వారి లోఆత్మ స్థైర్యం పెరిగిందని చెప్పారు. గణితంలో మెళుకవలు తెలియడం వల్ల గణిత సమస్యలు వేగవంతముగా చేయగల్గుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రేరణ శిక్షణా సేవా సమితి సేవలను ఎంతో అభినందనీయమన్నారు. దీనికి సహాయ, సహకారం అందిస్తున్న ప్రేరణ శిక్షణ సేవా సమితి వ్యవస్థకులు నోటి నాగార్జునకి, మిని మైండ్స్ రజిత శ్రీ, సాయి బిందుకి, ప్రత్యేక అభినందనలు తెలిపారు

## డ్రోన్ కెమేరాలతో నిరంతర నిఘా

**బహిరంగంగా మద్యపానం సేవిస్తే ఉపేక్షించేది లేదు**

**మంగళగిరి పట్టణ సిఐ వినోద్ కుమార్**



**మంగళగిరి మేజర్ న్యూస్ :** డ్రోన్ కెమేరాలతో అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తున్నారు మంగళగిరి అర్బన్ పోలీసులు. బహిరంగ మద్యపానం, గంజాయి సేవించడం వంటి వాటిపై ఉక్కు పాదం మోపుతున్నారు. అర్బన్ సీఐ డి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయాలు, ఆటో నగర్, ఆర్టీసీ డిపో రోడ్డు ప్రాంతాలలో డ్రోన్ కెమెరాల ద్వారా పలువురు ఆకతాయిలను గుర్తించారు. వారికి సిఐ వినోద్ కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగంగా మద్యపానం సేవించినా, అల్లర్లకు పాల్పడినా, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైలెన్సర్ లో తీసేసి బిగ్గర శబ్దాలతో ద్విచక్ర వాహనాలను నడిపితే వాహనాలను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తరచూ వివిధ పనులపై స్థానికులు తిరుగుతుంటారని, మహిళలు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారని వారికి ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ వినోద్ కుమార్ హెచ్చరించారు.

## గంజాయి ముఠాకు జగన్ మద్దతు తెలపడం శోచనీయం

**తెనాలి, మేజర్ న్యూస్ :** గంజాయి ముఠాకు మాజీ ముఖ్యమంత్రి మద్దతు తెలపడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ మంగళవారం తెనాలి పర్యటనను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ శ్రేణులు స్థానిక మార్కెట్ వంతెనపై రాస్తారోకో నిర్వహించారు. జగన్ రాజకీయ లబ్ధి కోసమే తెనాలి పర్యటన చేపట్టాడని ఆరోపించారు. ఎందరో అమాయకులపై గంజాయి, మద్యం మత్తులో దాడులకు పాల్పడిన ముఠా సభ్యులను జగన్ పరామర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూల్పూరుకు చెందిన యువకుడు నూతక్కి రవికిరణ్ ను లడ్డూ గ్యాంగ్ దారుణంగా హత్యచేసి మృతదేహం ఆనవాలు లేకుండా చేశారన్నారు. దళితుడైన నూతక్కి రవి కిరణ్ కుటుంబాన్ని జగన్ నాడు అధికారంలో ఉండగా ఎందుకు న్యాయం చేయలేకపోయారని ప్రశ్నించారు. కనీసం వారి కుటుంబాన్ని నేటికీ పరామర్శించకపోవడం జగన్ ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. జగన్ వ్యవహార తీరుపై పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఐతానగర్ ప్రాంతంలోని జగన్ కు నిరసన సెగ తగిలింది. ఎమ్మార్పీస్ శ్రేణులు జగన్ పట్టణ సందర్భంగా నల్ల బెలూన్ లు ఎగురవేస్తూ పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షేక్ దరియావలికి గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నివాళి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామ ఎంపీటీసీ షేక్ ఖాసింబి కుమారుడు షేక్ దరియావలి గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని మాజీ శాసనసభ్యులు శ్రీనివాస్ రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. దరియా వలి మృతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, పార్టీలో ఎంతో క్రమశిక్షణతో ఉండి, పార్టీ అభివృద్ధికి పాటు పడ్డారని, యువకుడైన దరియావలి హఠాన్మరణం దిగ్భ్రాంతికి లోను చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసరావుపేట ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ పదముత్తం చిట్టి బాబు ,మాదినేని దసయ్య , కొల్లా నారాయణ మరియు గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోజన నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి





**నూజెండ్ల మేజర్ న్యూస్ :** మండల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాల నందు పనిచేయుచున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకులు ( సి సి హెచ్) లకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూజెండ్ల నందు మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర అధ్యక్షతన మంగళవారం శిక్షణ కార్యక్రమం మరియు వంటల పోటీలు నిర్వహించారు. ఈ ట్రైనింగ్ లో భాగంగా పాఠశాల విద్యార్థికి పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, భోజన తయారీలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట వండేటప్పుడు పోషకాలు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ సంవత్సరం నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. వంటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్ర, రిసోర్స్ పర్సన్ పద్మావతి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సి ఆర్ ఎం టి ఎస్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వెన్నుపోటు.. గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డి దే



- కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా
- తొలి ఏడాదిలో 10శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం
- ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** బీసీ సామాజికవర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బైరైటీస్ మైన్లో జగన్ తాత రాజారెడ్డికి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్ని హత్య చేసి ఆ మైన్ను రాజారెడ్డి కబ్జా చేశాడు. బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బైరైటీస్ గని యాజమాని అయ్యారని గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ వెన్నుపోటు దినం కార్యక్రమం చేసే అర్హత జగన్ కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డంపెట్టుకొని రూ. లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించారన్నారు. శివకుమార్ స్థాపించిన వైసీపీ పార్టీని కబ్జా చేసి శివకుమార్కు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎత్తుకొని పెంచిన బాబాయ్ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొండిచాడని మండిపడ్డారు. ఆస్తికోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ 85 శాతం హామీలు ఎగనామంపెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచినట్లు చెప్పారు. మద్యపాన నిషేదంపై మాట తప్పి, మడమ తిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి జగన్ వెన్నుపోటు పొడిచాడని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం మరోకటి లేదన్నారు. సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబునాయుడని, అసలైన వెన్నుపోటు దారుడు జగన్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ధ్వంసమైన అన్ని వ్యవస్థలను సీఎం చంద్రబాబు నాయుడు సరిచేస్తుంటే జగన్ వెన్నుపోటు దినం వంటి కార్యక్రమాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ముఠా దుష్ప్రచారాలు ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు.

# వెన్నుపోటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్

- కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్
- ఆస్తులు లాక్కుని బయటకు గెంటివేసి తల్లికి, చెల్లెలికి వెన్నుపోటు
- శవ రాజకీయాలు వైసీపీ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య
- స్కామ్లు బయటకు వస్తున్న తరుణంలో వెన్నుపోటు దినంగా ప్రకటించడం హాస్యాస్పదం
- కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్



**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీలో ఉంటూ లక్షల కోట్లు గడించి పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఘనుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని, స్కామ్ లు బయటకు వస్తున్న తరుణంలో తప్పించుకునేందుకు వెన్నుపోటు దినంగా ప్రకటించడం హాస్యాస్పదమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ... వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు, ఆ పార్టీ మొదటి వర్ధంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, వైసీపీ పార్టీకి కొన ఊపిరి కూడా లేకుండా చేసిన రాష్ట్ర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ మోహన్ రెడ్డి అని , అందులో ఎటువంటి సందేహమే లేదన్నారు. జగన్ చేసిన లక్షల కోట్ల అవినీతి కారణంగా ఏడాదిన్నర పాటు జైల్లో ఉన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని, వెన్నుపోటు దారుడిగా జగన్ దేశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాడని విమర్శించారు. వైఎస్ అవినాష్ రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వడం కోసం సొంత బాబాయి ని గొడ్డలితో అంతమొందించిన చరిత్ర జగన్ రెడ్డి ది కాదా? అని ప్రశ్నించారు. తల్లిని, చెల్లిని ఎన్నికల్లో వాడుకొని అధికారంలోకి రాగానే వారికి వెన్నుపోటు పొడిచాడని, చెల్లెలి ఆస్తుల్ని సైతం లాక్కొని బయటకు గెంటివేయడం వెన్నుపోటు కాదా? అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా బ్యానర్లు ముద్రించడం పై రామచంద్రపురం లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. కనీసం ఇంకిత జ్ఞానం లేకుండా డైవర్స్ పాలిటిక్స్ కు తెరలేపుతూ బ్యానర్లు ఏర్పాటు చేయడం సరికాదని, ఇందుకు 504,505 సెక్షన్లు వర్తిస్తాయని గుర్తు చేశారు. నా బీసీలు, నా ఎస్సీలు అని మాటిమాటికి ప్రస్తావించే జగన్ రెడ్డి సప్లై నిధులను పూర్తిగా మళ్లించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. 26 ప్రభుత్వ పథకాలు తీసివేసి బడుగు, బలహీన వర్గాల పాలిట వెన్నుపోటు దారుడిగా చరిత్రలోకి ఎక్కింది జగన్ రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. మద్యాన్ని రాష్ట్రం నుంచి పారద్రోలతామని హామీ ఇచ్చిన జగన్ కల్తీ మద్యాన్ని ప్రజలకు అందించి వారి ప్రాణాలతో ఆడుకున్నాడని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే కాకుండా కమీషన్ల కోసం కంపెనీలను రాష్ట్రం నుంచి గెంటివేసిన చరిత్ర జగన్ దే నన్నారు. రాష్ట్రంలో కులాల మధ్య, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి జగన్ చలిమంట కాచుకుంటున్నాడని విమర్శించారు. గడచిన 11 నెలల కాలంలో రూ. 8 లక్షల కోట్లు పెట్టబడులు తీసుకువచ్చామని, రానున్న రెండేళ్లలో ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రూ. 1200కోట్లతో రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు చేపట్టడంతో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు.

# యోగాను ప్రతిరోజూ ఆచరించాలి







**మంగళగిరి మేజర్ న్యూస్ :** యోగాను ఒక్కరోజు మాత్రమే కాదు జీవితకాలం ఆచరించాలని రాష్ట్ర టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ సూచించారు. మంగళవారం మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం గ్రౌండ్ నందు యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ , జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ , రాష్ట్ర మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. యోగా గురువుల ఆధ్వర్యంలో యోగా ఆసనాలు చేయడం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి పిలుపులో భాగంగా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. జూన్ 21న భారత ప్రధాని నరేంద్ర మోడీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించారని తెలిపారు. ఆరోజు విశాఖపట్టణంలోరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో ఐదు లక్షల మందితో జరిగే యోగ సాధన కార్యక్రమంలో భారత ప్రధాని పాల్గొననున్నారని తెలిపారు. యోగా ఆచరించేందుకు రెండు కోట్ల మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే ఒక కోటి 70 లక్షల మంది రిజిస్టర్ అయ్యారని తెలిపారు. వంద పర్యాటక ప్రదేశాల్లో యోగాను ప్రత్యేకంగా చేయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మంచి పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలు ఉన్నాయని , అరకు లోయలు, బీచ్ లు, కొండ ప్రాంతాలు, తిరుపతి పుణ్యక్షేత్రం, దుర్గమ్మ గుడి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వంటివి ప్రసిద్ధి చెందాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెల్నెస్ టూరిజం బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు హోటల్స్ రిసార్ట్స్ ను తీసుకురాబోతున్నారని , ఇప్పటికే ఆయా పర్యాటక ప్రాంతాల్లో 12 వేల గదులు ఉన్నాయని రాబోయే ఐదేళ్లలో 50 వేలకు సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన మంగళగిరిని పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు చెప్పారు. చేనేత వస్త్రాల పరంగాను మంగళగిరి ఎంతో ప్రఖ్యాతిగాంచిందని తెలిపారు. మంగళగిరిలో రివర్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ యోగా పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకే ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలలో ప్రత్యేకంగా యోగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను ప్రతిరోజు ఆచరించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని గుర్తు చేశారు. యోగాను మన పూర్వీకులు ఆచరించే వారని , మర్చిపోయిన



యోగాను తిరిగి ప్రజలకు గుర్తు చేసి ఆచరించేలా చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి, ఇందుకు సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి అనిత , మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష, యోగా అభ్యాసకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నమస్తే పథకం కార్యక్రమం ఘనంగా ప్రారంభం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ,సాధికారత మంత్రిత్వశాఖ నగర అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకానిస్డ్ శానిటేషన్ ఏకోసిస్టం) పథకం అమలులో భాగంగా, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ను నోడల్ ఏజెన్సీగా, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్ సి)ను రిసోర్స్ ఆర్గనైజేషన్గా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తో కలసి మండల పరిధిలోని వెనిగండ్ల వేస్ట్ పికర్లు,హెయిర్ పికర్ల ప్రొఫైలింగ్ కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో స్టేట్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్, డీబీఆర్సీ ప్రోగ్రాం డైరెక్టర్ చుక్క అనిల్ కుమార్, జిల్లా ఫీల్డ్ కో-ఆర్డినేటర్ , మల్లెలచిన్నప్ప, జిల్లా కో-ఆర్డినేటర్ నిర్మల, వెనిగండ్ల సిటీ కో-ఆర్డినేటర్ రవితేజ, వాలంటీర్లు, 100 మంది వృత్తి కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 125 మందికి ప్రొఫైలింగ్ పూర్తయ్యిందని తెలిపారు.

**నమస్తే పథకం ద్వారా లభించే ముఖ్య ప్రయోజనాలు**

రూ.5000 విలువ గల పిపిఇ కిట్,ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు,పిల్లలకు ఉచిత ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్, నమస్తే గుర్తింపు కార్డు ఏన్ఎస్ డీసీ / ఎన్ఎస్ కెఎఫ్ డీసీ సంక్షేమ పథకాలు, బ్యాంక్ లోన్లు, హౌసింగ్ లోన్లు, ఇతర ప్రభుత్వ బీమా పథకాలు, ప్రొఫైలింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పన, ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రొఫైలింగ్ వలన కార్మికుల గుర్తింపు, హక్కుల పరిరక్షణ, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనుసంధానం బలోపేతమవుతుందని తెలియజేశారు. ముఖ్యంగా, వేస్ట్ పికర్లు,హెయిర్ పికర్లను సమాజంలో గౌరవనీయ స్థాయికి చేర్చే దిశగా ఇది గొప్ప ప్రారంభమన్నారు.

**ప్రొఫైలింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు**

అధికారిక గౌరవం,గుర్తింపు, పని భద్రత, ఆరోగ్య పరిరక్షణ పరికరాల వనరులు, ఆర్థిక స్థిరత్వం, బ్యాంక్ సేవలు, రుణ ప్రాప్యత, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆదాయ వృద్ధికి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణకు మద్దతు, వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ, పిల్లల విద్య, బాల కార్మిక నిర్మూలనకు ప్రోత్సాహం, సామాజిక సాధికారత, వివక్ష నివారణకు దోహదం, నమస్తే పథకం ద్వారా వేస్ట్, హెయిర్ పికర్లు లాంటి అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికులకు సమగ్ర గుర్తింపు, ఆర్థిక స్వావలంబన, మరియు ఆరోగ్య పరిరక్షణ లభించే దిశగా ఒక చరిత్రాత్మక చర్య ప్రారంభమైంది. ఇది సమాజానికి, పర్యావరణానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి దోహదపడే దిశగా అద్భుత మార్గం అని తెలిపారు.

## తెనాలిలో వృద్ధురాలు అనుమానాస్పద మృతి



**తెనాలి, మేజర్ న్యూస్ :** అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ముత్యంశెట్టి పాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ మల్లిఖార్జున రావు తెలిపిన వివరాల ప్రకారం ముత్యంశెట్టి పాలెం అయ్యప్ప గుడి వెనుక నివాసం ఉంటున్న తాడిపర్తి నాగ మల్లేశ్వరి (60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందన్నారు. మృతురాలు ఒంటరిగా నివాసుతున్నాడని తెలిపారు. మృతురాలు టిఫెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నది. మంగళవారం విగత జీవిగా పడిఉండడాన్ని స్థానికులు గమనించి ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలిని హత్య చేసి బంగారం, నగదు దోపిడీ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి మెడపై గాయాలున్నాయి.

## ప్రతి ఒక్కరూ సేవా భావంతోటి ముందుకు వెళ్లాలి

**టిడిపి పార్టీ మహిళా నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి**




**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వెళ్లాలని డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. మంగళవారం నగరంలోని పట్టాపురంలో ఉన్న మాతృ శ్రీ పిల్లల ఆశ్రమంలో వేసవికాలం ముగిస్తున్న సందర్భంగా అహల్య ట్రస్ట్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో చిన్నారులకు మామిడి పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో సమాజానికి సేవ చేయాలని చెప్పారు. పి4 చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తూ ఆరోగ్యమైన ఆంధ్రప్రదేశ్ ని మనం తయారు చేస్తే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించవచ్చు అని నమ్ముతూ సేవా కార్యక్రమాలు ఆరోగ్యం పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వాళ్ళ ఆరోగ్య పరిస్థితిని తెలియజేశారు. పిల్లలు వ్యాయామం, యోగ, ఆహార నియమాలు పాటించాలని తెలిపారు.

## పోక్సో కేసు నమోదు



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైనట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్ బాబు మంగళవారం తెలిపారు. రెండో వివాహం చేసుకున్న మహిళ ఎనిమిదేళ్ల కూతురి పట్ల నిందితుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని చిన్నారి తల్లికి విషయం చెప్పడంతో, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వెస్ట్ డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

**గుంటూరు, మేజర్ న్యూస్ :**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధి లోని పీజీ మొదటి సెమిస్టర్ కు చెందిన పలు కోర్సుల పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరీక్షల సర్వ నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాద రావు ఈ ఫలితాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఈ ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్ఎ ఆర్కియాలజీ, ఎమ్ఎ ఎకనామిక్స్,ఎమ్ ఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎమ్ఎ పొలిటికల్ సైన్స్, ఎమ్ఎ హిస్టరీ, ఎమ్ఎ పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఎమ్ఎ డాన్స్, ఎమ్ఎ అప్లయిడ్ లింగ్విస్టిక్స్, ఎమ్ సి ఏ వంటి పీజీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎమ్ఎ కోర్సులతో పాటుగా డిప్లొమో ఇన్ ఫోటోగ్రఫీ ఫలితాలను సైతం వెలువరించామని సీఈ పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు పున్న మూల్యాంకనం కొరకు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన పీజీ ఫలితాలను కూడా అతి త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.



# రాష్ట్రానికి జగనే చేటు

- ప్రజలకు వెన్నుపోటు పొడిచావు కాబట్టే ఇంటికి పంపారు
- ఐదేళ్లు ప్రజాకంటక పాలన సాగించావు
- జగన్‌పై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ధ్వజం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

దొంగలకు, దోపిడీదారులకు మద్దతు పలికే జగన్ లాంటి నాయకులతోనే రాష్ట్రానికి చేటు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ నిర్వహించనున్న వెన్నుపోటు దినోత్సవంపై మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్ మాట్లాడారు. 151 సీట్లతో అధికారాన్ని అప్పగిస్తే ఐదేళ్లపాటు దోపిడీలు, ప్రజా కంటక పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని జగన్ పై మండిపడ్డారు. తన అధికారాన్ని అనుయాయులకు మేలు చేకూర్చేలా దుర్వినియోగం చేశారని విమర్శించారు. జగన్ చేసిన ద్రోహాలన్నీ ఒక్కొక్కటి బయటకు రావడంతో భయపడి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. జగన్ అధికారం చేపట్టిన వెంటనే అన్ని వర్గాలకు అన్యాయం చేశారని, ప్రధానంగా పేదోళ్లకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసేశారని గుర్తు చేశారు. మైనారిటీల హక్కులకు భంగం కలిగించారని, రంజాన్ తోఫా వంటి వాటిని తీసేశారని తెలిపారు. క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుకను ఆపేసిన నీదా ప్రజాపాలనంటే అని జగన్ ను సూటిగా ప్రశ్నించారు. ఒక్కొక్కరిపై 10 చొప్పున కేసులు ఉన్న రౌడీలకు మద్దతు తెలిపేందుకు తెనాలి పర్యటనకు వచ్చిన జగన్ ప్రజలకు ఏ ముఖం చూపిస్తారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 10 నెలల కాలంలోనే అన్న క్యాంటీన్ ద్వారా నిరుపేదలకు కడుపునిండా అన్నం పెడుతున్నామని తెలిపారు. సామాజిక పింఛన్లను రూ. 4 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ పేరుతో దగా చేస్తే సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో డిఎస్సీ ద్వారా నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు తీసుకుందని వివరించారు. గత వైసీపీ పాలనలో మద్యం పాలసీని మార్చేసి దోపిడీకి తెర లేపారని వివరించారు. కల్తీ మద్యం ద్వారా వందల మంది ప్రాణాలను బలిగొన్న నీచపు చరిత్ర జగన్ ది అని మండిపడ్డారు. ఒక డ్రైవర్ ను హత్య చేసి వాళ్లింటికే పార్సిల్ పంపించి దుర్మార్గపు పాలన సాగించారన్నారు. అందుకే ప్రజలు చీకొట్టారని తెలిపారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా మూడు ముక్కలాట ఆడారన్నారు. ప్రస్తుతం అమరావతి రాజధాని ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా రూపుదిద్దుకుంటుందని, ఇది ప్రజాపాలన అంటే అని ఆయన వివరించారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

**తెనాలి, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని అరాచక పాలనకు పోలీసులు వంత పాడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని ఐతానగర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘటన వివరాలను బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రులు, పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా అదుపు తప్పుడంతో పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పోలీసు వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటన సాక్ష్యం అని పేర్కొన్నారు. యువకులపై ఉన్న పాత కేసులకు పోలీసుల దాడికి ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. పోలీసుల దెబ్బలు తిన్న యువకులను వెనకేసుకు రావడం లేదని, వారిని అలా బహిరంగంగా హింసించడం ఎందుని నిలదీశారు.





- చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ధర్మమా...?
- ప్రభుత్వ తీరుపై మాజీ సీఎం జగన్ ఆగ్రహం

కేసుల వ్యవహారాన్ని కోర్టులు చూసుకుంటాయని అన్నారు. రాష్ట్రంలో యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం, ఎవరైనా ప్రశ్నిస్తే నేరంగా పరిగణిస్తోందని, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం అవుతున్నదని ఆక్షేపించారు. ఇందుకు తెనాలి వికృత ఘటన సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. తెనాలి టూ టౌన్, త్రీ టౌన్ సీఐ లు లాఠీలతో యువకుల అరికాళ్లపై చితకబాదడం ఏమిటన్నారు. అంతటితో ఆగక మరుసటి రోజు మరో రోడ్ సెంటర్‌కు తీసుకెళ్లి కిరాతకంగా కొట్టడం దారుణమన్నారు. మూడు రోజులు చట్టవిరుద్ధంగా వారిని తమ అదుపులోనే ఉంచుకోవడమే కాకుండా, వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కోర్టులో నోరు విప్పితే ప్రైవేట్ పార్టులకు కరెంట్ షాక్ ఇస్తామని బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పాలనకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినంగా పిలుపునిచ్చామని ప్రతి ఒక్కరు నిరసనకు మద్దతు తెలపాలని కోరారు. ఆయన వెంట మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, విడుదల రజని, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పలువురు నాయకులు ఉన్నారు.

# నేడు సత్తెనపల్లిలో వైసిపి భారీ ర్యాలీ

- సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పిలుపు
- కూటమి మోసాల్ని ఎండకట్టేందుకే నిరసన అంటూ వెల్లడి

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి పట్టణంలో భారీ ర్యాలీ. ప్రజలతో కలిసి అధికారులకు వినతి పత్రాల సమర్పిస్తామన్నారు.మొన్న వైసీపీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను నరసరావుపేట పార్లమెంటు పరిశీలికులు పూనూరు గౌతంరెడ్డి ఆవిష్కరించారు.గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుతో జరిగే ఈ నిరసన ర్యాలీను విజయవంతం చేయాలని మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైస్సార్సీపీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ పిలుపునిచ్చారన్నారు సమన్వయకర్త సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పిలుపు మేరకు పట్టణ, మండల, గ్రామ స్థాయి నుంచి ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఎండగడుతూ వెన్నుపోటు కు గురైన ప్రజానీకనికి మనం అండగా ఉండాలని తెలియజేస్తూ ఈ కార్యక్రమం జయప్రదం చేద్దాం అని పిలుపునిచ్చారు.





18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777



నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | | |
|---|---|---|
| పి. బాలు (చిన కొండయ్య)<br>బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.<br>సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు<br>గుంటూరు జిల్లా ఇన్‌చార్జి<br>సెల్ : 9959426987 | ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.)<br>స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా.<br>సెల్ : 8897455466 |

| | | | |
|---|---|---|---|
| ఎం.ఏడుకొండలు<br>సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి<br>సెల్ : 9030880455 | జి.హిరన్మాయి(కన్నల్)<br>నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి<br>జిల్లా క్రైమ్ రిపోర్టర్ | ఆళ్ల వీరభద్రరావు(భద్రం)<br>గుంటూరు జిల్లా క్రైం రిపోర్టర్<br>సెల్ : 9848411984 | చెట్టిపోగు కాశి<br>దాచేపల్లి రిపోర్టర్<br>సెల్ : 9963343327 |
| శేషగిరి రాజు<br>మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 8341408201 | వై.ఏసుబాబు<br>గురజాల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు<br>సత్తెనపల్లి రిపోర్టర్<br>సెల్ : 9866246951 | చెవుల రంగారావు<br>మెడికల్ రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 9490544635 |
| యం.కృష్ణ<br>మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9393309149 | వి.రవికుమార్<br>తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 99083 38200 | డి. చైతన్య<br>వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9381968453 | ఎస్.కె.రఫీ<br>చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 9949352147 |
| జి.ఏలియా<br>ముప్పాళ్ళ రిపోర్టర్<br>సెల్ : 9392231959 | బి.సాంబశివరావు<br>రాజుపాలెం రిపోర్టర్<br>సెల్ : 9949382676 | రమేష్<br>దుగ్గిరాల రిపోర్టర్<br>సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు<br>పెదకాకాని రిపోర్టర్<br>సెల్ : 9948175840 |
| కె.నాగరాజు<br>రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 7799881000 | డి.రమేష్<br>ఈపూరు రిపోర్టర్<br>సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ<br>నూజెండ్ల రిపోర్టర్<br>సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్<br>శావల్యాపురం రిపోర్టర్<br>సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి<br>నరసరావుపేట మెడికల్ రిపోర్టర్<br>సెల్ : 9849134987 | లక్ష్మీనారాయణ<br>రెంటచింతల రిపోర్టర్<br>సెల్ : 800079075 | వి.వెంకటరెడ్డి<br>బొల్లాపల్లి రిపోర్టర్<br>సెల్ : 80191 99991 | పి.వెంకటేశ్వర్లు<br>దుర్గి రిపోర్టర్<br>సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్<br>వెల్దుర్తి రిపోర్టర్<br>సెల్ : 9912818723 | ఎస్.విజయభాస్కర్<br>గుంటూరు రిపోర్టర్<br>సెల్ : 9440822538 | షేక్ నాగూర్<br>నకరికల్లు రిపోర్టర్<br>సెల్ : 98489 26300 | ఎం.కోటేశ్వరరావు<br>మాచవరం రిపోర్టర్<br>సెల్ : 6303775169 |
| సి.హెచ్.ప్రసాద్<br>గుంటూరు సిటీ రిపోర్టర్<br>సెల్ : 8125309319 | పి.ఆనంద్<br>వినుకొండ రూరల్ రిపోర్టర్<br>సెల్ : 8125125239 | జి.బాలాజీ<br>తాడికొండ రిపోర్టర్<br>సెల్ : 9603424824 | రమేష్<br>నరసరావుపేట రూరల్ రిపోర్టర్<br>సెల్ : 7075942600 |
| తేళ్ల రవీంద్రబాబు<br>గుంటూరు రిపోర్టర్<br>సెల్ : 7396234032 | డి.మల్లికార్జునరావు<br>యడ్లపాడు రిపోర్టర్<br>సెల్ : 8309237441 | "నేటి దినపత్రిక సూర్య"<br>ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు. | |